ఈనాడు
బాపట్ల
మంగళవారం అక్టోబరు 1, 2024

అలక్ష్యం.. మూడు కుటుంబాల్లో అంధకారం

★ పెనుమూడి వారధిపై వెలగని దీపాలు
★ యంత్రాంగం నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



పెనుమూడి వారధిపై సంఘటన స్థలంలో వాహనాలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె మండలంలో పెనుమూడి-పులిగడ్డ వారధిపై సెప్టెంబరు 29న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్ నుంచి రేపల్లె మండలం పెదఅరవపల్లి వస్తున్న సరకు రవాణా వాహనం, చీరాల నుంచి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సరకు రవాణా వాహనం యజమాని, చోదకుడు మాతంగి గంగాధర్, అతని మేనల్లుడు చెరుకూరి శ్యాం అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడి గుంటూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెనాలికి చెందిన బచ్చలపూడి సౌజన్య (27) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు వారధిపై ప్రమాదం జరిగిన ప్రాంతంలో సుమారు 300 మీటర్ల దూరం విద్యుత్తు దీపాలు వెలగకపోవడమే ప్రమాదానికి కారణమనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు అనుసంధానమైన వారధిపై నిత్యం వందల సంఖ్యలో వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. వారధిపై విద్యుత్తు దీపాలు వెలిగేలా చూడాల్సిన అధికారుల నిర్లక్ష్యానికి రోజూ ఏదో ప్రమాదం చోటుచేసుకుని పలువురు గాయపడుతున్నారని, నిండుప్రాణాలు బలవుతున్నాయని మృతుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా వారధిపై రాత్రిళ్లు విద్యుత్తు దీపాలు సక్రమంగా వెలిగేలా రెండు జిల్లాల అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరిందన్నారు. మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. వారధిపై పలుచోట్ల విద్యుత్తు దీపాలు వెలగడం లేదన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

తీరని విషాదం

ప్రమాదంలో మృతి చెందిన గంగాధర్ విద్యుత్తు పనులు, శుభ కార్యాలు, పండగ ఉత్సవాలకు డీజేలు పెట్టి కుటుంబాన్ని పోషించుకునేవాడు. కృష్ణా జిల్లా పెడనకు చెందిన శ్యామ్ ఇటీవల మేనమామ వద్దకు వచ్చాడు. వినాయక చవితి వేడుకలకు విద్యుత్తు దీపాలు, డీజేల ఏర్పాట్లలో మామకు సాయంగా నిలిచాడు. గంగాధర్ పెదనాన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా తెనాలికి చెందిన బచ్చలపూడి గురవయ్య, సౌజన్య వారి కుమార్తె అమ్ములుతో కలిసి గత నెల 28న రేపల్లె మండలం పెదఅరవపల్లి వచ్చారు. కార్యక్రమం పూర్తయిన మరుసటి రోజు కుటుంబీకులు, బంధువులు కలిసి మంగినపూడి బీచ్‌కి వెళ్లారు. అక్కడ అందరూ సంతోషంగా గడిపి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గంగాధర్, శ్యామ్, సౌజన్య మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం మిగిలింది.

పంచాయతీరాజ్ డీఈగా రాజన్న



బాపట్ల పట్టణం: పంచాయతీరాజ్ బాపట్ల సబ్ డివిజన్ ఉప కార్యపాలక ఇంజినీర్‌గా పి.రాజన్న సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఒంగోలులో పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్లకు వచ్చారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. డీఈగా బాధ్యతలు చేపట్టిన రాజన్నకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

5న చీరాలలో ఉద్యోగ మేళా

చీరాల, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ పిన్నెటి తెలిపారు. చీరాల ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగే ఈ మేళాకు పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, పీజీలు చేసిన వారు పాల్గొనవచ్చని చెప్పారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు.

జిల్లాలో ఇసుక కొరత

జిల్లాలో ఇసుక కొరతతో భవన నిర్మాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ యార్డుల్లో ఎక్కడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో పీఎంఏవై ఎన్టీఆర్ నగర్‌లలో పేదల పక్కా గృహాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జిల్లాలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం నుంచి తెచ్చుకోవాల్సి వస్తుంది. 150 కిలోమీటర్ల దూరం నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి రావడంతో గృహ నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీన్ని అవకాశాన్ని తీసుకొని కొందరు ఇసుక అక్రమ తవ్వకాలు తెరలేపారు. చీకటి మాటున అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారు.

ప్రభుత్వం గత జులైలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. బాపట్ల మార్కెట్ యార్డు, జువ్వలపాలెం, కొరిశపాడు మండలం అనమనమూరు, అద్దంకి మండలం తిమ్మాయపాలెం, మార్టూరు, వేటపాలెంలో గనుల శాఖ ఆధ్వర్యంలో ఇసుక డంప్ యార్డులు ఏర్పాటు చేసి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆగస్టు రెండో వారం నాటికే డంప్ యార్డుల్లో ఇసుక నిల్వలు అయిపోయాయి.



బాపట్ల, న్యూస్‌టుడే

> తాళ్లాయపాలెం నుంచి తెచ్చుకోవాల్సి రావడంతో దూరభారం
> భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం

కృష్ణా నదిలో గాజుల్లంక, జువ్వలపాలెం వద్ద ఇసుక తవ్వకాల కోసం పర్యావరణ అనుమతుల కోసం గనుల శాఖ అధికారులు ప్రయత్నిస్తుండగా వరద వచ్చింది. అక్టోబరు 15 తర్వాతే నదిలో ఇసుక తవ్వడానికి అనుమతులు వస్తాయని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుకను 90 కి.మీ. దూరంలోని గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అద్దంకి నియోజకవర్గంలో నిర్మాణదారులు ఇసుక తెచ్చుకోవడానికి 150 కి.మీ. దూరం రవాణా భారం భరించాల్సి వస్తోంది. చీరాల వాసులకు అయితే 108 కి.మి. దూరం నుంచి ఇసుక రావాల్సి ఉంది. రవాణా ఖర్చుల రూపంలో రూ.వేల భారం పడుతోంది.

అక్రమ తవ్వకాల జోరు

మరోవైపు ఎన్ని ఆంక్షలు పెట్టినా అక్రమ తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. చీరాల నియోజకవర్గంలో అక్రమంగా తవ్వి లారీల్లో, ట్రాక్టర్లలో పొరుగున ఉన్న బాపట్లకు తరలిస్తున్నారు. లారీ ఇసుకకు రూ.32 వేలు, ట్రాక్టర్ ఇసుకకు రూ.6 వేలు చొప్పున నిర్మాణదారుల నుంచి వసూలు చేసి విక్రయిస్తున్నారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున వాహనాల్లో ఇసుక తెచ్చి పోస్తున్నారు. కృష్ణా నది తీరంలోనూ గుట్టు చప్పుడు కాకుండా ఇసుక తవ్వి వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో విక్రయిస్తున్నారు. అధిక ధరకు ఇసుక కొనుగోలు చేయలేని వారు గృహాలు, భవన నిర్మాణ పనులు ఆపేస్తున్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి తగ్గిపోతోంది. ప్రభుత్వం స్థానికంగా డంప్ యార్డుల్లో ఇసుక అందుబాటులోకి తెస్తే రవాణా ఖర్చులతో కలిపి ట్రాక్టర్ ఇసుక రూ.నాలుగు వేలకే వస్తుంది. ప్రస్తుతం నల్లబజారులో ట్రాక్టర్‌కు అదనంగా రూ.రెండు వేలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.



పీఎంఏవై కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

పేదల ఇళ్లకు 4 వేల టన్నులు కావాలి

జిల్లాలో పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీల్లో వివిధ దశల్లో ఉన్న 3436 ఇళ్ల నిర్మాణాన్ని డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ ఇసుక ఉచితంగా అందజేస్తోంది. ఇసుక అందుబాటులో లేక కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణ పనులు నెమ్మదించాయి. చాలాచోట్ల ఆగిపోయాయి. పేదల ఇంటి నిర్మాణానికి నాలుగు వేల మెట్రిక్ టన్నుల ఇసుక కావాల్సి ఉందని ప్రభుత్వానికి గృహ నిర్మాణ శాఖాధికారులు నివేదిక పంపించారు. ఇసుక వస్తేనే గృహాల నిర్మాణంలో కదలిక వస్తుంది.

ఈనెల 15 తరువాత అందుబాటులోకి తెస్తాం

గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో ప్రస్తుతం ఇసుక అందుబాటులో ఉంది. ప్రజలు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసి రవాణా ఛార్జీలు కలిపి చెల్లిస్తే కోరుకున్న చోటుకు ఇసుక వస్తుంది. అన్ని అనుమతులు తీసుకొని జిల్లాలోని కొల్లూరు మండలంలో గాజుల్లంక, జువ్వలంక రీచ్‌లలో కృష్ణా నదిలో అక్టోబరు 15 తర్వాత ఇసుక తవ్వకాలు చేపట్టి జిల్లాలోని డంపింగ్ యార్డులకు తరలించి విక్రయిస్తాం. **- రాజేష్, గనుల శాఖ ఏడీ**

104.. కదలాలంటే తోయాల్సిందే!



గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన 104 వాహనాలు మొరాయిస్తున్నాయి. ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లేక్రమంలో ఇబ్బంది కలిగిస్తున్నాయి. బండి బయల్దేరాలంటే తోయాల్సిందే. అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మేదరమెట్ల పీహెచ్‌సీకి చెందిన 104 వాహనాన్ని సిబ్బంది, రోగులు కలిసి సోమవారం ఇలా నెడుతున్నారు. ఈవిషయమై జిల్లా 104 వాహనాల నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మంను వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, అద్దంకి

రైతేరాజు

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

పశువ్యాధులను సమర్థంగా ఎదుర్కొందాం

6లో

సెక్యూరిటీ గార్డుకు గౌరవ డాక్టరేటు



పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి పాతగొల్లపాలెం గ్రామానికి చెందిన తాను నాటక రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ వారు తమిళనాడులోని హోసూరులో శనివారం డాక్టరేటు ఇచ్చారని మద్దిన ఏడుకొండలు సోమవారం తెలిపారు. బీఎస్సీ చదివిన తాను ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలో సిద్ధయ్య పాత్ర ద్వారా 150 ప్రదర్శనలు, సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడు, చింతామణిలో సుబ్బిశెట్టి వేషాలతో ప్రదర్శనలు ఇచ్చానని వివరించారు. దీనికి గుర్తింపుగా డాక్టరేటు ఇచ్చారని తెలిపారు. **- పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే**

సాగునీరు అందించండి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల-పేరాల చిట్టివాద పొలాలకు సాగునీరు అందించాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట అన్నదాతలు సోమవారం ఆందోళనకు దిగారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సక్రమంగా సాగునీరు అందించడానికి ముందుకొచ్చి నర్సాయపాలెం లాకుల దగ్గర నుంచి చీరాల వరకు ఉన్న కాలువలు బాగుచేసేందుకు రూ.9లక్షల నిధులు మంజూరు చేసినా అధికారులు పనులు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. ఇప్పటికే రైతులు రూ.10 వేల వంతున ఒక్కొక్కరు వ్యయం చేసి నార్లు పోయడంతో అవి నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. చిట్టివాద, విజయ్‌నగర్ కాలనీకి చెందిన రైతులతో పాటు వెంకటరమణయ్య, బోయిన కృష్ణ, మల్లెల విజయ్, హనుమంతరావు, సుబ్బారావు, భిక్షాలు ఉన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

భూమాయ

☛ అగ్రిమెంట్ చేసుకున్న భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు
☛ ఆ వివరాల ఆధారంగా రిజిస్ట్రేషన్
☛ రాజధాని భూసమీకరణకు దరఖాస్తు



ఇది 12.06 ఎకరాల వ్యవహారం. రాజధాని ప్రాంతం రాయపూడిలో నదీపాతంలో ఉన్న ఈ భూమికి అగ్రిమెంట్ రాయించుకున్న ఓ వ్యక్తి వెబ్‌ల్యాండ్‌లో తన పేరు నమోదు చేయించడం... ఆపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడం... అనంతరం రాజధాని భూసమీకరణకు దరఖాస్తు చేయడం తాజాగా వెలుగులోకి వచ్చింది. తద్వారా రూ. 30 కోట్ల మేర ప్రయోజనాలు కొట్టేసేందుకు పన్నిన వ్యూహం బట్టబయలైంది. ఈ వ్యవహారం ఇంత చురుగ్గా సాగడానికి తెర వెనుక నడిపించింది నాటి వైకాపా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన ఓ సలహాదారుడు కావడం గమనార్హం.

ఈనాడు, అమరావతి

రాయపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 71, 72, 73, 1-ఎం, 1-12/2బీ2లో ఒక కుటుంబానికి భూమి ఉంది. ఇందులో సీలింగ్‌లో సగం పోగా మిగిలింది ముగ్గురు వారసులకు సంక్రమించింది. ఇందులో ఒక వారసుడికిచ్చిన భూమి మొత్తం సీలింగ్‌లో పోయింది. మిగిలిన ఇద్దరికిచ్చినదాంట్లో కొంత భాగం సీలింగ్‌లో పోగా మరికొంత మిగిలింది. సీలింగ్‌లో మొత్తం భూమి కోల్పోయిన వ్యక్తి మిగిలిన వారసులకు అనువంశికంగా వచ్చిన భూమికి 2019లో అగ్రిమెంట్ చేసుకున్నారు. తరువాత చక్రం తిప్పి రెవెన్యూ అధికారుల సహకారంతో వెబ్‌ల్యాండ్‌లో తన పేరుతోనే సర్వే నంబర్లు, విస్తీర్ణం రికార్డులకెక్కించి అనంతరం తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సర్వే నంబర్లలో 12.06 ఎకరాలున్నట్టు చూపించారు. ఆ తరువాత కొంతభాగం మరో మహిళకు విక్రయించినట్టు చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. రాయపూడిలో భూమి ఉండగా.. దుగ్గిరాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఇదంతా 2021లో చోటుచేసుకుంది. దీని వెనక నాటి వైకాపా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ సలహాదారుడి పాత్ర ఉండడంతో అధికారులు ఆగమేఘాల మీద వ్యవహారాలను చక్కబెట్టారు.

సమీకరణలో లేని భూములు సేకరణ ఎలా?: రాజధాని ప్రాంతంలో రైతుల నుంచి భూములను తీసుకునే క్రమంలో సీఆర్‌డీఏ 9.1 భూసమీకరణ ప్రకటన ఇచ్చింది. ఆయా గ్రామాల్లో భూసమీకరణ కింద తీసుకునే సర్వే నంబర్లు, విస్తీర్ణాన్ని విస్పష్టంగా ప్రకటించింది. దీనికి భిన్నంగా 2023లో రాయపూడి గ్రామంలోని సర్వే నంబరు 1-12/2బీ2, 1-ఎం, 71, 72, 73లో 12.16 ఎకరాలు భూసమీకరణ కింద తీసుకోవాలని 9.3 కింద సదరు వ్యక్తి దరఖాస్తు ఇచ్చారు. ఇందులో తన తరఫున 4.35 ఎకరాలు, ఈయన నుంచి భూమి కొనుగోలు చేసిన మహిళ తరఫున 7.71 ఎకరాలు తీసుకోవాలని కోరారు. ఈ సర్వే నంబర్లు గతంలో సీఆర్‌డీఏ ఇచ్చిన భూ సమీకరణ ప్రకటనలో లేవు. దీంతో అనుమానించిన సీఆర్‌డీఏ అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలని గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని కోరారు. రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక ఇచ్చారు. అయితే.. భూసమీకరణ కింద ఇచ్చినవారికి ఆ భూమి చెందుతుందా? లేదా? అని స్పష్టత ఇవ్వలేదు. వారికసలు ఆ భూములు ఎలా సంక్రమించాయో పూర్వాపరాలు ఆరా తీయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై గుంటూరు జిల్లా యంత్రాంగం, సీఆర్‌డీఏ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది.

తీరం.. పరిశుభ్రంగా ఉంచుదాం..



తీరంలో వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: సముద్ర తీర ప్రాంతాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పర్యాటకులు, మత్స్యకారులపై ఉందని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకుడు అంషుమన్ ప్రసాద్ దాస్ అన్నారు. చీరాల మడలం వాడరేవు తీరం వద్ద సోమవారం స్వచ్ సాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, మత్స్యకారులకు అవగాహన కలిగించి, పరిసరాలలోని వ్యర్థాలను తొలగించారు. ఈసందర్భంగా ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ.. సముద్ర తీరాలు నానాటికి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండి అపరిశుభ్ర వాతావరణానికి ఆలవాలుగా మారుతున్నాయన్నారు. దీనివల్ల అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. యువ కేంద్రం గుంటూరు అధికారి కిరణ్మయి, దేవి రెడ్డి, కార్డ్స్ ఎన్‌జీవో అధ్యక్షుడు నాదెండ్ల కోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదేవి, మండల పరిషత్ ఈవోఆర్డీ బాపూజీ, జయరాజ్, తిరుపతయ్య, ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, ప్రిన్సిపల్ పాల్, పోలీసు, వైద్య శాఖలలోని సిబ్బంది పాల్గొన్నారు.

నచ్చినోళ్లకు నచ్చిన పోస్టింగ్‌లు..!

☛ వాణిజ్యపన్నుల శాఖలో లోపించిన పారదర్శకత
☛ ఆడిట్ శిక్షణ తీసుకున్న అధికారిని మేనేజర్ పోస్టులోకి బదిలీ

ఈనాడు, అమరావతి

వాణిజ్యపన్నులశాఖ ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకత లోపించింది. తాజాగా జరిగిన బదిలీలపై గుంటూరు జోన్ పరిధిలోని ఉద్యోగవర్గాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, నిబంధనలకు భిన్నంగా ఈ బదిలీలు జరిగాయని కమర్షియల్ టాక్సెస్ గెజిటెడ్ అధికారుల సంఘం తప్పుబట్టింది. బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఆసంఘ ప్రతినిధులు రాతపూర్వకంగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. పన్నుల ఎగవేతను గుర్తించడానికి శాఖలో ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహణపై అనుభవం కలిగిన అధికారులను గుర్తించి వారికి పెద్ద మొత్తంలో ఖర్చు భరించి ప్రభుత్వం శిక్షణ ఇప్పించింది. వారిని ఆ పోస్టుల్లో మాత్రమే వాడుకోవాలి. కానీ ప్రస్తుత బదిలీల్లో ఆడిటింగ్ నిర్వహణపై శిక్షణ పొందిన డీసీటీవో ఒకరిని నిబంధనలకు విరుద్ధంగా గుంటూరులో ఓ డివిజన్‌కు మేనేజర్‌గా బదిలీ చేశారు. అలాంటప్పుడు వారికి ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి శిక్షణ ఇప్పించడం నిధులను వృథా చేయడమే కదా? పరిపాలనా పోస్టులకు బదిలీ చేయడం వల్ల ఏమి ఉపయోగమని ప్రశ్నిస్తున్నారు. ఇదొక్కటే కాదు గుంటూరు జోన్ పరిధిలో ఐదేళ్ల సర్వీసు నిండిన వారిలో నలుగురు అధికారులు ఉన్నారు. వారిని కచ్చితంగా బదిలీ చేయాలి. కానీ రిక్వెస్ట్ బదిలీలు కోరుకున్న వారిని నెల్లూరు జిల్లా నుంచి గుంటూరు డివిజన్‌కు బదిలీ చేసి.. వారికి ప్రాధాన్యమివ్వడంపై విమర్శలు వచ్చాయి. బాపట్లలో పనిచేసే పి.శేషగిరిరావు, కమిషనర్ కార్యాలయంలో పనిచేసే ఎల్.రాధిక, నెల్లూరులో పనిచేసే ఎం.చంద్రశేఖర్‌ను గుంటూరు డివిజన్‌కు మార్చారు. వారి బదిలీలు సరికాదని ఉన్నతాధికారులే వారిని ఏరికోరి ఇక్కడకు మార్చారనే ఆరోపణలు వినవస్తున్నాయి.




గుంటూరులోని వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

వైకాపా ప్రభుత్వం కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ పేరుతో గ్రానైట్ వ్యాపారం బాగా జరిగే చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, అద్దంకి ప్రాంతాల్లోని సీటీవో కార్యాలయాలను రద్దుచేసి వాటిని ఇతర ప్రాంతాల్లో కలిపారు. నాడు ఈ కార్యాలయాల రద్దు వెనుక వైకాపా నేతల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన నేతలకు వ్యాపారులు కప్పం కడితే చాలు సంబంధిత లారీలను ఎవరూ చెక్ చేయకుండా పంపేలా గ్రానైట్ ఇలాకాలోని కార్యాలయాలను ఎత్తేశారు. నాడు కార్యాలయాలను రద్దు చేసి వైకాపా నేతలకు వ్యక్తిగత ప్రయోజనం సమకూరేలా వ్యవహరించిన ఉన్నతాధికారులే నేడు బదిలీల్లో చక్రం తిప్పారు. వారి చెప్పు చేతుల్లో ఉండే వైకాపా వీరభక్త అధికారులకు కీలక స్థానాలు దక్కాయి. అదెలా సాధ్యపడిందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

విచారణ జరిపించాలి: ఉద్యోగుల సంఘం

ఈ అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి రాతపూర్వకంగా తీసుకెళ్లామని ఏపీ కమర్షియల్ టాక్సెస్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడు, గుంటూరు జిల్లా వాణిజ్యపన్నుల అధికారి హరికృష్ణ తెలిపారు. తాను సంఘంలో రాష్ట్ర బాధ్యతల్లో ఉన్నాను. తనకు ఐదేళ్ల సర్వీసు నిండింది. అయితే ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల్లో ఇలా సర్వీసు నిండిన వారిని అదే పట్టణంలోని వేరే డివిజన్ కార్యాలయానికి బదిలీ చేయాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. అయితే అందుకు భిన్నంగా తనను నెల్లూరు మార్చారు. బదిలీల్లో పారదర్శకత లోపించిందని చెప్పడానికి నాకు జరిగిన అన్యాయమే నిదర్శనమన్నారు. దివ్యాంగుడైన డీసీటీవో రవీంద్రబాబు రాష్ట్ర సంఘంలో ఉన్నారు. ఆపై ఆయన దివ్యాంగుల ఉద్యోగుల సంఘ నాయకుడు. ఆయన్ని భీమవరం సర్కిల్ నుంచి విజయవాడకు బదిలీ చేశారు. వాస్తవానికి దివ్యాంగులను బదిలీ చేయరాదని సూచించింది. ఈ బదిలీ ఎలా చేశారని ఆయన ప్రశ్నించారు.

సుందరం సంతోషం




'సత్యం సుందరం' చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా సోమవారం నంబూరు వీవీఐటీ కళాశాలలో విద్యార్థులతో కథానాయకుడు కార్తి సందడి
- పెదకాకాని, న్యూస్‌టుడే

రూ.20 కోట్లతో మరో క్యాన్సర్ వార్డు

గుంటూరు, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి నాట్కో క్యాన్సర్ కేంద్రానికి అనుబంధంగా రూ.20 కోట్ల వ్యయంతో అదనంగా మరో వార్డును నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ కొనియాడారు. నూతన వార్డు నిర్మాణానికి వీలుగా అక్కడున్న పురాతన భవనాన్ని తొలగించే పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు క్యాన్సర్ చికిత్సకు గుంటూరు వస్తున్నందున పడకలు సరిపోవడంలేదన్నారు. ఈ సమస్యను గుర్తించిన నాట్కో ఫార్మా సీఎండీ వీసీ నన్నపనేని, ఉపాధ్యక్షుడు సదాశివరావు స్పందించి మరో 150 పడకలతో వార్డును నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. సెల్లార్‌తోపాటు నాలుగు అంతస్తుల భవనం ఇక్కడ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఏడాది గడువులో ఈ పనులు పూర్తి కావచ్చన్నారు. పాత భవనం తొలగింపు పనులు పూర్తయిన వెంటనే కొత్త వార్డు పనులకు భూమి పూజ చేయనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం లెవల్-2 క్యాన్సర్ సెంటర్‌గా గుర్తింపు పొందిన ఈ కేంద్రం త్వరలోనే లెవల్-1 స్థాయికి చేరనుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగం అధిపతి శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ కేంద్రం సమన్వయకర్త అశోక్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి విద్యుత్తు ఎస్ఈగా ఆంజనేయులు



బాపట్ల, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖ జిల్లా ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ)గా జి.ఆంజనేయులు నియమితులయ్యారు. జిల్లా ఆవిర్భవించిన రెండున్నరేళ్ల తర్వాత ఇటీవల విద్యుత్తు సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విద్యుత్తు శాఖ ఈఈగా పనిచేస్తున్న ఆంజనేయులుకు ఇన్‌ఛార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు.

ఎస్సీ, ఎస్టీల శ్మశానాలకు భూ కేటాయింపునకు ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల శ్మశానవాటికలకు భూములు కేటాయించాలని అధికారులను కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 145 అర్జీలు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పోరంబోకు భూములు గుర్తించి శ్మశానవాటికలకు కేటాయించాలన్నారు. ఎస్టీలకు ఆధార్, రేషన్‌కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. 41 అర్జీలు పునరావృతం కావటంపై అధికారులను ప్రశ్నించారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో సత్తి బాబు, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.


రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్న దివ్యాంగురాలు రాధా లక్ష్మి

పింఛను మంజూరు చేయరూ!.. చీరాలకు చెందిన దివ్యాంగులు రాధా లక్ష్మి కలెక్టర్‌ను కలిసి తాను 90 శాతం వైకల్యంతో బాధపడుతున్నానని తెలిపింది. ప్రస్తుతం దివ్యాంగ పింఛను కింద రూ.6 వేలు ఇస్తున్నారని, రూ.15 వేల పింఛను మంజూరు చేయించాలని, మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని వినతిపత్రంలో కోరింది.

అక్రమంగా విధుల నుంచి తొలగించారని ఫిర్యాదు

చీరాల పురపాలక సంఘంలో 12 ఏళ్లుగా పని చేస్తున్న 27 మంది ఇంజినీరింగ్ కార్మికులను 2021న విధుల్లో నుంచి తొలగించారని కలెక్టర్‌కు ఏపీ పురపాలక కార్మికుల సంఘం నేతలు చంద్రం, దాస్ ఫిర్యాదు చేశారు. కార్మికులు హైకోర్టును ఆశ్రయించగా వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేసి కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చినగంజాం: చినగంజాం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి ట్రైఅథాలన్ (అథ్లెటిక్స్‌లోని ఒక భాగం) అండర్-14 విభాగంలో ఎంపికయ్యారని పీడీ ఎస్.వాణిశ్రీ తెలిపారు. ఈ నెల 9న ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలలో 200 మీటర్ల విభాగంలో (ప్రకాశం జిల్లా) ఎం.ఐశ్వర్య, ఈ నెల 13న ఇంకొల్లులో జరిగిన 600 మీటర్ల విభాగంలో డి.సింధు(బాపట్ల జిల్లా) ఎంపికయ్యారని చెప్పారు. వీరు అక్టోబరు 3 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను ప్రిన్సిపల్ సుమాంజలి అభినందించారు.

బాధితులకు సత్వర న్యాయం


బాధితుల సమస్య వింటున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితులు అందించే ఫిర్యాదులపై చట్ట పరిధిలో సత్వర విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 46 ఫిర్యాదులు వచ్చాయి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యలతో వచ్చిన వారి నుంచి ఎస్పీ, అదనపు ఎస్పీ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విన్నారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బస్సులో బంగారు ఆభరణాలు పోయాయని ఫిర్యాదు


సుస్మిత

హైదరాబాద్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చెరుకుపల్లి వస్తుండగా 116 గ్రాముల బంగారు ఆభరణాలు పోయాయని మహిళ పోలిశెట్టి సుస్మిత ఫిర్యాదు చేసింది. ఆమె మాట్లాడుతూ తన భర్త మణితేజ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారని తెలిపింది. సెప్టెంబరు 26న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చెరుకుపల్లిలో పుట్టింటికి వచ్చినట్లు పేర్కొంది. మార్గమధ్యలో తెనాలిలో బస్సు టైరు పంక్చరు కావటంతో వేరే బస్సులో చెరుకుపల్లి పంపించారని, ఇంటికి వచ్చి బ్యాగులో చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదని తెలిపింది. దీనిపై చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానని, కేసు విచారణ చేసి పోయిన నగలు రికవరీ చేసి ఇప్పించాలని ఎస్పీని కోరింది.

ఆర్టీసీ డ్రైవర్లకు రక్షణ కల్పించాలి

రేపల్లె అర్బన్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు సంస్థ భరోసాగా నిలవాలని, వారికి రక్షణ కల్పించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు చిక్కాల మణిలాల్ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 28న రేపల్లె నుంచి విజయవాడ వెళ్తున్న అద్దె బస్సు డ్రైవర్ సమ్మెట వెంకట గోపిపై గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి వద్ద మద్యం మత్తులో ముగ్గురు యువకులు దాడి చేసిన సంఘటనకు నిరసనగా రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ సిబ్బందికి అండగా నిలవాల్సిన అధికారులు చులకనగా మాట్లాడడం శోచనీయమన్నారు. దాడికి పాల్పడిన నిందితులను శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు సరైన రక్షణ కల్పించకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విధులు బహిష్కరించి సమ్మెబాట పడతామని హెచ్చరించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మదర్ థెరెస్సా అద్దె బస్సు యూనియన్ నాయకులు గోపీ, ప్రసాద్, సుబ్బయ్య, భాను, రవీంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

మొదటి మూడేళ్లలో రూ.10 లక్షలు మిగిలాయి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

వ్యవసాయంలో మార్కెట్ అవసరాలు, వినియోగదారుల అభిరుచులను అందిపుచ్చుకుంటూ సాధారణం కన్నా భిన్నమైన రకాల పంటలు సాగు చేస్తూ వినూత్న సాగుతో ముందుకెళ్తున్నాడు విఠంరాజుపల్లికి చెందిన రైతు పగడాల చిన కోటిరెడ్డి. ఆరేళ్ల క్రితం ఆయనకున్న 3 ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంపకం చేపట్టాలని ఆసక్తి కలిగింది. గ్రామంలో ఎక్కువ మంది కూరగాయలు పండిస్తారు. తాను కొత్త పంటలు సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని భావించి డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేయాలని నిర్ణయించాడు. ఒక్కొక్క మొక్క రూ.50 ఖరీదుతో తెలంగాణలోని భద్రాచలం నుంచి ఎకరానికి 1600 మొక్కలు చొప్పున మూడెకరాలకు 4800 మొక్కలు తెప్పించాడు. సేద్యం, నాటడం, కలుపు, ఇతర ఖర్చులు ఎకరాకు రూ.2.80 లక్షలు చొప్పున మూడెకరాలకు రూ.8.40 లక్షల వరకు ఖర్చులు అయ్యాయి. నాటిన ఏడాదిన్నరకు మొదటి కోతలో ఎకరాకు టన్ను దిగుబడి రాగా టన్ను రూ.1.40 లక్షల చొప్పున మూడు ఎకరాలకు రూ.4.20 లక్షల ఆదాయం వచ్చింది. రెండో ఏడాది ఎకరాకు 2 టన్నులు, మూడో ఏడు 3 టన్నులు చొప్పున దిగుబడి వచ్చింది. రెండో ఏడాది టన్ను ధర రూ.1.30 లక్షలు, మూడో ఏడు రూ.1.10 లక్షలు చొప్పున ధర లభించింది. ఈ ఏడాది మొదట్లో వాతావరణం అనుకూలించక సరైన దిగుబడి రాలేదు. ప్రస్తుతం మాత్రం పంటకు రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చింది.


డ్రాగన్ ఫ్రూట్ తోటలో రైతు చిన కోటిరెడ్డి

తెలంగాణ అవగాహన లేక తెలుపు, ఎరుపు రంగుల కాయలు వచ్చేలా సాగు చేశాను. తెలుపు కాయలు కొనేది. దీంతో చెట్లను తొలగించి వాటి స్థానంలో ఎరుపు చెట్లు నాటాను. గతేడాది వరకు అన్ని ఖర్చులు పోను మూడేళ్లలో మూడెకరాలకు రూ.10 లక్షలు మిగిలాయి. నిరుడు దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో వాతావరణం అనుకూలించలేదు. గత నెల వరకు రూ.3 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇప్పుడు కాపు బాగానే వచ్చింది ఆదాయం కూడా బాగానే ఉంది. చెట్ల నుంచి పిలకలు తీసి మొక్కలు తయారు చేస్తున్నాను. ఎవరికైనా నాటుకోవడానికి అవసరమైతే ఇస్తాను.

– చిన కోటిరెడ్డి

రైతేరాజు

పశువ్యాధులను సమర్థంగా ఎదుర్కొందాం

వేమూరు, న్యూస్‌టుడే : వర్షాకాలం సీజన్‌లో పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల పశు పోషకులు ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని వేమూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు జనార్దనరావు తెలిపారు. వ్యాధి సోకాక వైద్య చికిత్స చేయించడం కంటే, ముందుగానే ప్రభుత్వం అందించే టీకాలు వేయించాలని సూచించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై ఆయన తెలిపారు.


పశు సంవర్ధక శాఖ ఏడీ జనార్దనరావు

గొంతువాపు వ్యాధి

లక్షణాలు : ఇది మూడేళ్ల లోపు దూడలకు వస్తుంది. ఇది సోకాక 103 నుంచి 104 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి వెంట చొంగ కారడం, గొంతువాపు వచ్చి, ఊపిరితిత్తులకు శ్వాస సరిగా అందదు. సకాలంలో వైద్యం అందకపోతే పశువు మృతి చెందే ప్రమాదం ఉంది.

నివారణ : యాంటిబయోటిక్స్, జ్వరం తగ్గడానికి మెలోనెక్స్, మెగ్లుడిన్ ఇంజక్షన్లు వాడాలి. ముందుగా వ్యాధి రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయి.

గాలికుంటు సోకితే

లక్షణాలు : ఇది సోకిన పశువులకు జ్వరం వస్తుంది. నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. దీంతో పశువు నడక తగ్గిపోతుంది. పాడిగేదెల్లో పూర్తిగా పాలు తగ్గిపోతాయి.

నివారణ : ఈ వ్యాధి సోకిన పశువులకు యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు, బ్లోరో గ్లిజరిన్ పేస్ట్ పుండ్లపై పూయాలి. వ్యాధి సోకకుండా నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయి.

వ్యాధి పేరు : కుందేటి వెర్రి

లక్షణాలు : ఇది సోకిన పశువులకు 104 డిగ్రీల జ్వరం వస్తుంది. పాడి పశువులకు పాలు తగ్గిపోతాయి, మేత సరిగా తీసుకోవు.

నివారణ : సర్రాల్, ట్రిక్విన్ ఇంజక్షన్‌లు చేయించాలి.

మెంతికూర సాగు.. ఆదాయం మెండు

చినగంజాం, న్యూస్‌టుడే : చినగంజాం మండల పరిధిలోని ఇసుక భూముల్లో విద్యుత్తు మోటార్ల కింద మెంతి కూర సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. మండల పరిధిలోని మోటుపల్లి, శాంతినగర్, రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, మూలగానివారిపాలెం, కొత్తపాలెం, మున్నంవారిపాలెం, శాంతినగర్ తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు. సుమారు 200 మంది రైతులు మెంతి కూర సాగును తక్కువ కమతాల్లో చేస్తున్నారు. విత్తిన వారం రోజుల్లో మొక్కలు తొలగించి.. అమ్ముతుంటారు. మెంతి కూరను నెల్లూరు, ఒంగోలు, చీరాల, బాపట్ల, తదితర ప్రాంతాల మార్కెట్లకు పంపుతుంటారు. ఏడాది పొడవునా సాగు జరుగుతూనే ఉంటుంది. ఇక్కడ ఇసుక నేలల్లో పండే మెంతి కూరకు మంచి డిమాండ్ ఉంది.


విద్యుత్తు మోటార్ల కింద ఇసుక నేలలో పెంచిన మెంతి కూర

ఆదాయం ఇలా.. వారం వ్యవధిలో పెరిగే మెంతి కూర సాగు సెంటు విస్తీర్ణంలో పది కిలోల విత్తనాలకు రూ.950 వ్యయం చేస్తారు. కిలో రూ.95 చొప్పున పది కిలోలకు రూ.95 ఖర్చు పెడతారు. సెంటు విస్తర్ణంలో వారం రోజుల్లో వెయ్యి కట్టలు మెంతి కూర దిగుబడి వస్తుంది. స్థానికంగా కట్ట కూర రూ.2 ఉంటుంది. మార్కెట్‌లో కట్ట మెంతి కూర రూ.5 ఉంటుంది. ఒక్కో రైతు పది సెంట్ల విస్తీర్ణంలో సాగు చేయగా వంద మంది రైతులు కలిపి రెండెకరాల్లో సాగు చేస్తున్నారు. వారం రోజుల సాగు కాలానికి రెండు ఎకరాలకు కలిపి రూ.1.90 లక్షల వ్యయం అవుతుంది. రెండెకరాల్లో లక్ష మెంతి కూర కట్టలు దిగుబడి వస్తుంది. కట్ట రూ.2 వంతున రెండు ఎకరాలకు రూ.5 లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో మెంతి కూర రైతులు ఏడాది పొడవునా లాభాల బాటలో పయనిస్తున్నారు.

క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం

బాపట్ల, న్యూస్‌టుడే: బాలికలు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 5 కి.మీ. మారథాన్ పరుగు పోటీలో చీరాల వైఏ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వి.చెన్నని ద్వితీయ, ఎన్.రమ్య జోయ్ తృతీయ స్థానంలో నిలిచారు. కలెక్టరేట్లో తనను కలిసిన విద్యార్థినులను కలెక్టర్ సోమవారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలవాలన్నారు. జేసీ ప్రఖర్‌జైన్, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఎయిడ్స్ నియంత్రణ విభాగాధికారి జానీబాషా, కళాశాల పీడీ నీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సేవలకు గుర్తింపు

అద్దంకి, న్యూస్‌టుడే: రోగులకు అందిస్తున్న సేవలు, సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని అద్దంకిలోని గాజులపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి జాతీయ ఆరోగ్య మిషన్ గుర్తింపు లభించింది. కొవిడ్ అనంతరం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్యమిషన్ ఏర్పాటు చేసింది. ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించేలా పరిశీలన చేయడం ఈ మిషన్ ఏర్పాటు ఉద్దేశం. ఆరోగ్య కేంద్రాన్ని సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించగా 2022 నవంబరులో ప్రారంభించారు. పేదలు నివసించే ఏకలవ్యనగర్, గుర్రాల కాలనీ, వేలమూరిపాడు, నర్రావారిపాలెం, శ్రీరామ్‌నగర్ ఎస్టీకాలనీ, పసుమర్తిపాలెం తదితర కాలనీల్లోని సుమారు 22 వేలమంది జనాభాకు ఇది ప్రాతినిధ్యం వహిస్తోంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుంది. ప్రస్తుతం 50 మంది రోగులు నిత్యం వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు. సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన ఇక్కడ రోగులకు అందుతున్న సేవల గురించి గతనెల 13, 14 తేదీల్లో జాతీయ నాణ్యతా ప్రమాణాల సాధికారత కమిటీ సభ్యులు డాక్టర్ రుషికేష్(మహారాష్ట్ర), డాక్టర్ వలర్‌మతి(తమిళనాడు)కి చెందిన వైద్యబృందం అన్ని విభాగాలను తనిఖీ చేసింది. క్షేత్రస్థాయిలో రోగులకు అందించే సలహాలు, సూచనలు, ఆసుపత్రిలో రోగులకు అందించే టీకాలు, కుటుంబ సంక్షేమం, కాన్పులు, చిన్నారుల ఆరోగ్య సేవలు, ప్రయోగశాల, మందులు, సాధారణ పరిపాలన, మౌలిక సదుపాయాలు తదితర అంశాల గురించి నిశితంగా పరిశీలన చేశారు. వాటికి సంబంధించిన ఫలితాలను ఈనెల 23న విడుదల చేశారు. ఇందులో 100 మార్కులకు 83.63 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. బాపట్ల జిల్లాలో మొత్తం 12 పట్టణ ఆరోగ్య కేంద్రాలుండగా అద్దంకి పట్టణంలోని గాజులపాలెం, రేపల్లెలోని రెండు, బాపట్లలోని విశ్వబ్రాహ్మణ కాలనీ, ఎస్‌జీ కాలనీలో, చీరాల వైకుంఠపురంలోని ఆరోగ్య కేంద్రాలకు జాతీయ ఆరోగ్య మిషన్ గుర్తింపు వచ్చింది.


గాజులపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం

అదనపు నిధుల కేటాయింపు

ఈ గుర్తింపుతో రాబోయే రోజుల్లో ఆయా ఆరోగ్య కేంద్రాలకు అదనపు నిధులు మంజూరు చేస్తారు. రోగులకు అవసరమైన వైద్య పరికరాలు, మందుల కొనుగోలుకు వాటిని ఉపయోగించుకోవచ్చు. ఇదే సమయంలో ప్రతి మూడేళ్లకొకసారి ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి తగు నివేదికలు, పనితీరును పునఃసమీక్షిస్తారు.

కాలానుగుణ వ్యాధులపై అవగాహన



ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం. గ్రామాల్లో ప్రబలుతున్న కాలానుగుణ వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నాం. అందువల్లనే ఇటీవల తనిఖీ చేసిన కేంద్ర బృందం 83.63 మార్కులు వేసింది.

- డాక్టర్ జి.జయసింహ, వైద్యాధికారి, గాజులపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం

నిర్వాసితులకు పరిహారం అందిస్తాం

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు వద్ద కృష్ణా కరకట్ట సమీపంలో నివాసం ఉంటున్న వారి ఇళ్లు వరదల్లో కొట్టుకుని పోవడంతో పక్షవాతానికి గురైన ఒంటరి వృద్ధురాలితో సహా నిర్వాసితులైన మూడు కుటుంబాలకు సంబంధించి 'ఈనాడు'లో కథనం రావడంతో ఆర్ఐ శివ త్రివేణి వారి వద్దకు వెళ్లి సోమవారం మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదని, తమకు బియ్యం నిత్యావసరాలు పంపిణీ చేయలేదని, చెట్టుకిందే నివాసం ఉంటున్న తమకు తాత్కాలికంగా వసతి ఏర్పాటుకు ప్లాస్టిక్ పట్టాలు కావాలని వారు ఆర్ఐని కోరారు. పరిహారం విషయమై ఒకసారి బ్యాంకు ఖాతాలు పరిశీలించిన అనంతరం తమను కలవాలని, బియ్యం, నిత్యావసరాలు పంపుతామని, ప్లాస్టిక్ పట్టాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వీరి వద్దకు వెళ్లిన స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది పక్షవాతంతో ఉన్న వృద్ధురాలిని ప్రాథమిక వైద్యశాలకు తరలిస్తే వైద్యం చేస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారు. వీరి దుస్థితి గమనించిన సీపీఎం నాయకులు అగస్టీన్, సుబ్బారావు బియ్యం, నిత్యావసరాలు అందించారు. చుండూరు మండలం వలివేరుకు చెందిన దాతలు సమకూర్చిన దోమ తెరలను బాధిత కుటుంబాలతో పాటు ఇదే రీతిలో నిర్వాసితులైన చిలుమూరులంకలో యానాది సామాజిక వర్గానికి చెందిన నాలుగు కుటుంబాలకు స్థానికుడు తోడేటి నానిబాబు ద్వారా పంపిణీ చేశారు.


బాధితులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

స్పందనకు వందనం

ఎట్టకేలకు గండి పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

నిజాంపట్నం, న్యూస్‌టుడే : మండలంలోని బావాజీపాలెం పంచాయతీలో అదవల- నిజాంపట్నం డొంక దారికి గండి పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిజాంపట్నం రావాలంటే 2 కి.మీ చుట్టు తిరిగి వచ్చేవారు. దీనికోసం సమయం, నగదు వెచ్చించలేక అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యపై సెప్టెంబరు 21న 'డొంక దారికి గండి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి మహమ్మద్ నజీర్ అహ్మద్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య స్పందించారు. పొక్లెయిన్ తెప్పించి గండి పూడ్పించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వెలిబుచ్చారు.

చీరాల రామనగర్‌లో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల రెండో పట్టణ పరిధిలోని రామనగర్‌లో ఆదివారం ఉదయాన్నే పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీనిలో 30 లీటర్ల సారా, రెండు వేల లీటర్ల బెల్లంఊట, అనుమానంగా ఉన్న 30 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తిలేదన్నారు. చీరాలను నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామన్నారు. ఇప్పటికైనా ఈప్రాంత ప్రజలు ఇటువంటి కార్యక్రమాలు విడనాడాలని సూచించారు. మంచి ఉపాధి ఎంచుకుంటే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, రెండో పట్టణ, మొదటి పట్టణ, గ్రామీణ సీఐలు నాగభూషణం, ఎం.శ్రీనివాసరావు, ఎం.శేషగిరిరావు, 130 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మూడేళ్ల బాలిక మృతి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : గాయపడి చికిత్స పొందుతూ మూడేళ్ల గిరిజన బాలిక అంకమ్మ (3) మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై తిరుపతిరావు అందించిన సమాచారం మేరకు స్థానికంగా ఉండే శెట్టి సత్యం మృతి చెందడంతో అతని భార్య మల్లేశ్వరి భిక్షాటన చేసి కుమార్తెను పోషిస్తోంది. ఈనెల 21న అంకమ్మను ఎత్తుకుని నడుస్తూ కింద పడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అంకమ్మ తలకు గాయం కావడంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ బాలిక సోమవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం, తల్లి మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రత కాపాడాలి


ప్రదర్శన నిర్వహిస్తున్న భాజపా, వీహెచ్‌పీ నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జ్ఞాన సత్యప్రతాప్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ నుంచి హిందూ ఆలయాలకు విముక్తి కల్పించాలని కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భావనారాయణ స్వామి ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు నేతలు ప్రదర్శన నిర్వహించారు. హిందూ ఆలయాలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరుతూ కలెక్టర్ వెంకట మురళికి నేతలు వినతిపత్రం అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. నేతలు బాబు నాగేంద్ర, బాలనారాయణ, భావనారాయణ, రజిని, మోహన్‌గౌడ్, నటరాజన్, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మానవ జీవనానికి భగవద్గీత దిక్సూచి

ఆరేపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మానవ జీవనానికి భగవద్గీత దిక్సూచి వంటిదని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఐలాపల్లి రంగారావు అన్నారు. తితిదే, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మానవ జీవనానికి భగవద్గీత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఆయన సోమవారం అందించారు. తితిదే ధర్మప్రచారక్ జిల్లా సమన్వయకర్త ఐ.అమ్మయ్య ఆదేశాల మేరకు పాఠశాలల్లో భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామని ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో నేతలు బుర్రే అరుణకుమారి, గుర్రం వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కె. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మరదాసు కోటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రులు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లిలో వేంచేసిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజల్ శ్రీనివాసవర్మ తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ఈనెల 3న అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా, 4న శ్రీ గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలిత త్రిపురసుందరి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మీదేవి 9న సరస్వతి దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారని భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73135, వేమూరు: 91107 837382

? చుండూరు గురుకుల పాఠశాల భవన సముదాయాల మధ్య చెత్త పేరుకుపోయింది. దీని గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. **- స్థానికులు, చుండూరు.**

✓ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం. **- లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, చుండూరు**

– న్యూస్‌టుడే, వేమూరు

సాగుకు సాహసం చేయాల్సిందే..!

వంతెన లేని డొంకమార్గంలో రైతుల అవస్థ


వేమూరు, న్యూస్‌టుడే

రైతులు పంట భూములకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి చదలవాడ నుంచి జంపని వైపు వెళ్లే డొంకమార్గంలో నెలకొంది. ఈ మార్గంలో చదలవాడకు సంబంధించిన 500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ పనులకు ఆ మార్గం గుండా వెళ్లాలంటే కొల్లిపర ఛానల్‌పై చప్టా దాటుకుని అవతలి వైపునకు వెళ్లాల్సి ఉంది. కాలువలో నీరు తక్కువగా ఉంటే చప్టాపై నడుచుకుంటూ అవతలి వైపునకు చేరొచ్చు. పూర్తిస్థాయిలో నీరు ప్రవహిస్తున్న సమయంలో చప్టాపై వెళ్లలేని పరిస్థితి. ఎవరైనా వెళ్లాలని సాహసం చేస్తే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఏళ్ల తరబడి చదలవాడకు చెందిన రైతులు ప్రాణాలను పణంగా పెట్టి కాల్వ నీటిలో నడుచుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్లి వ్యవసాయం చేస్తున్నారు. చప్టా స్థానంలో వంతెన నిర్మించాలని పాలకులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథులు లేరని వారు వాపోతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మిస్తామని చెప్పి, ఆ విషయాన్ని గాలికొదిలేశారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.



చదలవాడ వద్ద కొల్లిపర ఛానల్‌పై నీరు పారుతున్న చప్టా మీదుగానే పొలాలకు వెళ్లాల్సి ఉంది

ఏది తరలించాలన్నా ఇబ్బందే



చదలవాడ నుంచి జంపని వైపు పొలాలకు వెళ్లే డొంకమార్గంలో మా కుటుంబం సభ్యులకు కలిపి 15 ఎకరాల పొలం ఉంది. ట్రాక్టర్లు, టైరు బండ్లలో ఎరువులు, పంట ఉత్పత్తుల తరలింపునకు ఆ మార్గం గుండా వెళ్లాలంటే చప్టా దాటుకుని వెళ్లాలి. కాల్వలో నీరు తక్కువగా ప్రవహిస్తుంటే పర్వాలేదు. నీరు నిండుగా ఉన్న సమయంలో ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి. లేదంటే వేరే మార్గంలో రెండు కి.మీ. దూరం కాల్వ కట్టపై నడుచుకుంటూ వెళ్లాలి. గతంలో కాల్వ కట్టలు పటిష్ఠంగా ఉన్నప్పుడు టైరుబండ్లు వెళ్లేవి. ఇప్పుడు కాల్వ కట్ట బలహీనంగా ఉండడంతో ఎరువుల మూటలు నెత్తిన పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇలా చేయడం వల్ల ఎరువు చేరవేతకు అదనంగా ఖర్చులు అవుతున్నాయి. కొల్లిపర ఛానల్‌పై చప్టా వద్ద వంతెన నిర్మిస్తే రైతులకు ఇబ్బందులతో పాటు ఖర్చులు తగ్గుతాయి.

- ఎన్.లక్ష్మణరావు, రైతు చదలవాడ

అధికారుల దృష్టికి తీసుకెళతాం

సమస్యను రైతులు వినతిపత్రం రూపంలో ఇస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తాం. **- రవికుమార్, ఏఈ, సాగునీటి శాఖ**

వ్యాధుల విజృంభణకు దగ్గర దారి

పట్టణంలో విజయలక్ష్మీపురం ఒకటో లైన్‌లో మురుగు కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువ వెంబడి పిచ్చి చెట్లు దట్టంగా పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది. దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు అల్లాడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో కాలువలో పూడిక తీసి వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దీనిపై పురపాలక ఏఈ ఉమామహేశ్వరరావును సంప్రదించగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువను శుభ్రం చేసి దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బాపట్ల



కాలువ వెంబడి దట్టంగా పిచ్చిమొక్కలు

సీఎం సహాయ నిధికి రూ.1,01,116 విరాళం

బాపట్ల, న్యూస్‌టుడే: వరద బాధితులకు తెదేపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలిచి ఆదుకుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. వరద బాధితుల సహాయం కోసం సీఎం సహాయ నిధికి బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్ల సంఘం తరపున రూ.1,01,116 విరాళాన్ని సంఘం అధ్యక్షుడు కోల్లపూడి శివరామప్రసాద్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. రైస్‌మిల్లర్ల సంఘం కార్యదర్శి పీవీ రంగారావు, నేతలు జీవీవీ ఆంజనేయులు, నల్లమల్లి శ్రీనివాసరావు, టి.గురుబ్రహ్మం, డీవీ సుబ్రహ్మణ్యం, రమేష్, టి.సత్యం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు విరాళం చెక్కు ఇస్తున్న రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శివరామప్రసాద్

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.శ్రీహరిరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ వయో వృద్ధులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సత్కరిస్తారని పేర్కొన్నారు. తమ సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నేడు చెకుముకి మండల స్థాయి పోటీలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: జేవీవీ ఆధ్వర్యంలో నేడు మండల స్థాయి చెకుముకి పోటీలు గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని వేదిక మండల అధ్యక్షుడు కటారి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 8, 9, 10 తరగతుల నుంచి విజేతలు ఒక బృందంగా వారి పాఠశాల తరపున నేటి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు తప్పక పోటీకి పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వేదిక మండల ప్రధాన కార్యదర్శి కంచె రామ్మోహనరావు, సభ్యుడు కోటేశ్వరరావు పర్యవేక్షిస్తారన్నారు.

పోలేరమ్మకు పూజలతో సంఘీభావం

చెరుకుపల్లి న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీకి నిరసనగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన పార్టీ శ్రేణులు చెరుకుపల్లి గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు మత్తి భాస్కరరావు, మండల పార్టీ నేత దూళ్ల సురేష్, స్థానిక తెదేపా, జనసేన నేతలు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, విస్సంశెట్టి శ్రీనివాసరావు, యెల్లెల రవికిరణ్, ఉప్పు సాంబశివరావు పలువురు భజన సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపునకు వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో 35 ఏళ్లుగా నివసిస్తున్న 125 పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బండ్ల కాంతారావు విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వాడలోని 3.19 ఎకరాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు రూ.3.19 లక్షలను ప్రభుత్వానికి చెల్లించామన్నారు. జాప్యం చేయకుండా పేదలకు స్థలాలు ఇవ్వాలని కోరారు.

రూ.3 కోట్ల బకాయిలు చెల్లింపునకు వినతి.. సాధారణ పరిపాలన శాఖలో 1974 నుంచి పని చేసిన తనకు రూ.3 కోట్లు బకాయి రావాల్సి ఉందని, వెంటనే చెల్లించేలా చూడాలని కోరుతూ కలెక్టర్‌కు చెరుకుపల్లికి చెందిన సర్దార్ ఖాన్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలని ఉన్నతాధికారులు గతంలో ఉత్తర్వులు జారీ చేసినా అమలు కాలేదన్నారు. తన వినతిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



కలెక్టర్ వెంకట మురళికి సమస్య వివరిస్తున్న రక్షణసైన్యం సంస్థ ప్రతినిధులు

✦ బాపట్ల రైలుపేటలో చర్చి ఆవరణలో నిర్మిస్తున్న భవనానికి అనుమతి ఇవ్వాలని రక్షణసైన్యం సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

✦ చెరుకుపల్లిలో మురుగు కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా పిల్లర్లతో వంతెన నిర్మిస్తున్నాడని దీని వల్ల తమ పంట పొలాలు ముంపు బారినపడతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ స్థానిక రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆర్డీవో కార్యాలయానికి 12 అర్జీలు..

రేపల్లె అర్బన్, నిజాంపట్నం: రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 12 అర్జీలు వచ్చినట్లు సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు. 216 జాతీయ రహదారిపై రేపల్లె మండలం పెనుమూడి వద్ద నిర్మించిన గోడల వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున తొలగించాలని, ఇసుకపల్లిలో తన పేరుతో ఎక్కువగా నమోదైన భూమిని తొలగించాలని, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో మోటారు బోర్లు తొలగించాలని, నిజాంపట్నం మండలం పల్లపట్ల, నగరం మండలం పమిడిమర్రులో ఉన్న తమ భూములను ఆన్‌లైన్లో నమోదు చేయాలని, నగరం మండలం బుద్దలంక బంకుకు రెండువైపుల ఆక్రమణలు తొలగించాలని, భట్టిప్రోలు మండలం ఓలేరులో ఇచ్చిన లంక భూమి పట్టాలో సవరణ చేయాలని, కొల్లూరు మండలంలో అవకతవకలకు పాల్పడుతున్న పలువురు వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని, నిజాంపట్నం మండలం దిండిలో జ్ఞానభక్తప్రసన్నాంజనేయస్వామిగుడి భూమి సర్వే చేసి సరిహద్దులు చూపాలని, భట్టిప్రోలు మండలంలో ఓలేరులో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని, రేపల్లె జీడీసీసీ బ్యాంకులో రాజీవ్ మహిళ పొదుపు సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని, రేపల్లె మున్సిపాలిటీలో కొత్త విద్యుత్తు మీటరు మంజూరు చేయించాలని అర్జీ అందజేశారు.

పచ్చదనమే పుడమికి రక్షక కవచం

బాపట్ల, న్యూస్‌టుడే: పుడమికి పచ్చదనమే సహజ రక్షక కవచమని బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ టీఈ గోపాలకృష్ణమూర్తి అన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అయిదు మొక్కలు నాటి సంరక్షణకు దత్తత తీసుకోవాలన్నారు. పచ్చదనం పెరిగితే వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. పోషకాహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కావూరివారిపాలెంలో ఎంపీపీ పాఠశాలకు వెళ్లి తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకునే విధానం, ప్లాస్టిక్ వ్యర్థాల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బాలికల వసతిగృహాల ఆవరణలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించి పరిసరాలు శుభ్రం చేశారు. కళాశాల ఏడీ డీడీ స్మిత్ మాట్లాడుతూ సమాజ సేవకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు.

పడమటి కాల్వల్లో పారుదల ఎలా?

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పడమటి కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క ఏపుగా పెరిగింది. ఇది నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంది. సాగునీరు సకాలంలో దిగువకు వెళ్లక రైతులు అవస్థలు పడుతున్నారు. అమృతలూరు మండలంలో ఇంటూరు నుంచి తురుమెళ్ల వరకు సుమారు 4వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు కట్ట తెగితే వరి పొలాల్లోకి నీరు చేరే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ రవీంద్రబాబు రెండ్రోజుల్లో తూడుకాడ తొలగించి నీటిపారుదలకు ఆటంకం లేకుండా చేస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, అమృతలూరు



రహదారి కోత.. ప్రయాణానికి చింత



కర్లపాలెం మండలంలో పెదగొల్లపాలెం పంచాయతీ మార్పుచెన్నాయవారిపాలెం ప్రధాన రహదారి అంచుల్లో కోతకు గురై పెద్ద గుంత పడింది. ఈ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. వాహనచోదకులు ఆదమరిస్తే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి షణ్ముఖరావును సంప్రదించగా రహదారి గుంత పూడ్చి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కర్లపాలెం

ఎగబాకిన నిర్లక్ష్యం

వేమూరు మండలం పోతుమర్రులో పంచాయతీ చెరువు సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రికపైకి పిచ్చిమొక్కలు ఎగబాకుతున్నాయి. దీని వల్ల ఇక్కడ తరచూ విద్యుత్తు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై వేమూరు విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ గోపిని సంప్రదించగా వెంటనే విద్యుత్తు సహాయకుడితో మాట్లాడి పిచ్చిమొక్కలను తొలగిస్తామన్నారు. సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, వేమూరు



శిరస్త్రాణ ధారణ తప్పనిసరి




బాపట్ల: మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవటానికి దిచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని డీఎస్పీ జి.రామాంజనేయులు అన్నారు. బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 59 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. శిరస్త్రాణం ధరించకపోవటం వల్ల తలకు తీవ్ర గాయాలై మరణించారన్నారు. వారం తర్వాత శిరస్త్రాణ ధారణ నిబంధన తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. త్వరలో కెమెరాలను అమర్చుతారన్నారు. బాపట్లలో ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని పటిష్ఠం చేస్తామన్నారు. సమావేశంలో సీఐలు అహ్మద్ జానీ, హరికృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం: రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రవీంద్ర తెలిపారు. కర్లపాలెం ఐలాండు కూడలిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది బాధితులు యువకులేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు.

సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్



ప్రసంగిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్

బాపట్ల: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగుల సేవల ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు, కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. డీఏ ఇవ్వాలని, ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కల్వర్టు ఛిద్రమై రోడ్డెక్కిన మురుగు

రేపల్లె పెదకూరగాయల మార్కెట్ వెనుక నుంచి ఆరో వార్డులోని వినాయకుని గుడికి వెళ్లే మలుపులో కల్వర్టు ఛిద్రమైంది. మురుగు కాల్వ పారుదలకు అవరోధంగా మారడంతో నీరు రోడ్డుపైకి చేరి సెలయేరును తలపిస్తోంది. రాకపోకలు చేసేందుకు బాటసారులు, ద్విచక్ర వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. కొంత కాలంగా మురుగు నీరు రోడ్డుపైకి వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ నీటిలోనే రాకపోకలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి రామచంద్రరరావు మాట్లాడుతూ తక్షణం సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్



అవీ ఇవీ

ఎనిమిది అంశాలకు ఆమోదం

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె పురపాలక సంఘం సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఎజెండాలో పొందుపర్చిన ఎనిమిది అంశాలను సభ్యులు ఆమోదించారు. వైస్ ఛైర్మన్లు ప్రశాంతకుమార్, విశ్వనాథగుప్తా, కమిషనర్ సాంబశివరావు, టీపీవో విజయలక్ష్మి, ఏఈలు జాన్‌శామ్యూల్, రోహిణి, శానిటరీ అధికారి రామచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలో అలకాపురం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చీరాలకు చెందిన ఎస్.శ్రీనివాసరావు సోమవారం నిజాంపట్నం నుంచి ద్విచక్రవాహనంపై చీరాల వస్తుండగా అలకాపురం గాంధీ బొమ్మ సెంటర్‌లో అదుపుతప్పి పడటంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

నిజాంపట్నం: నర్రా వారి ఇలవేల్పు గుడారం కమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతనందించాలని జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య కోరారు. ఆలయం వద్ద పనులను సోమవారం పరిశీలించారు.

సకాలంలో పింఛన్లు అందించండి

నిజాంపట్నం, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీకి కేటాయించిన సిబ్బంది అర్హులకు సకాలంలో పింఛన్లు అందించి సహకరించాలని ఎంపీడీవో నాగలక్ష్మి కోరారు. పింఛన్ల పంపిణీ సిబ్బందికి సోమవారం తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకు పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు.

పేదల ఆకలి తీర్చటమే లక్ష్యం

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: పేదల ప్రజల ఆకలి తీర్చటమే లక్ష్యంగా అక్షయ హెల్పింగ్ హ్యాండ్స్ పనిచేస్తుందని నిర్వాహకుడు కామిశెట్టి సాయిబాబు చెప్పారు. స్థానిక ప్రాంతీయ వైద్యశాల వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. సంస్థలో సభ్యులంతా సొంత నిధులు సమకూర్చుకుని ఆకలితో అలమటించే పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి మోపిదేవి పరామర్శ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పెనుమూడి-పులిగడ్డ వారధిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేపల్లె మండలం పెదఅరవపల్లి నివాసి మాతంగి గంగాధర్ మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి బంధువులను పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకుని మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.25 వేలు అందించే ఏర్పాటు చేశారు.

క్రీడాకారులకు అభినందన

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: పాఠశాలల స్థాయిలో అండర్-14, 17 విభాగాల్లో భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాల, యడ్లపల్లి, పెరవలి, జంపని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ వంటి పోటీల్లో ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు 34 మంది ప్రతిభ చూపారు. సోమవారం పాఠశాల ఆవరణలో వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల సచివాలయ సందర్శన

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు గ్రామ సచివాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు విధానాన్ని డిజిటల్ అసిస్టెంట్ ప్రశాంత్ వివరించారు. సచివాలయం ద్వారా గ్రామస్థులకు అందిస్తున్న సేవలను కార్యదర్శి పుష్పకుమారి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి బాబూజీ, వృత్తి విద్య శిక్షకులు రౌఫాని, పావని పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూచిమంచి శివరామకృష్ణ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. పాఠశాల ఆవరణలో ఎంఈవో దేవరాజ్, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు, గ్లాసులను ఉపాధ్యాయుడు బహూకరించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి, ఎం.శ్రీనివాసరావు, బద్రినారాయణ, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వేల్పూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దేపల్లిలో ఆయుర్వేద శిబిరం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: అద్దేపల్లి ఎస్టీ కాలనీలో రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్యులు 136 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మలేరియా, డెంగీ, వైరల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయుర్వేద వైద్యంపై ప్రజలు ఆసక్తి చూపాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు బి.జితేంద్ర, ప్రసాదరావు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్లకు చెరుకుపల్లి విద్యార్థుల ఎంపిక

చెరుకుపల్లి న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రేపల్లెలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో చెరుకుపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ - 14 బాలికల ఖోఖో పోటీలకు టి.ఉమాహరిత, వి.దివ్యశ్రీ, పి.వర్ష, అండర్ - 14 బాలుర ఖోఖో జట్టుకు పి.లీలామోహనకృష్ణ, అండర్-17 ఖోఖో బాలికల జట్టుకు కె.వాసంతి, వై.రషిశ్రీ, వాలీబాల్ జట్లకు సీహెచ్ మహిచరణ్, కబడ్డీ జట్టుకు శివమణి జిల్లా జట్లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావును ఆయన అభినందించారు. చెరుకుపల్లి లిటిల్ హార్ట్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు జె.ఆకాష్, డి.నాగార్జున, కె.విజయ్‌వెంకటరెడ్డి అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన సభలో ఎంపికైన క్రీడాకారులను కరస్పాండెంట్ సీహెచ్.పార్థసారధి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ సామ్రాజ్యం, వ్యాయామ ఉపాధ్యాయుడు బీరుల్లా వారిని అభినందించారు.



ఖోఖో జట్లకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఎదుగుదల

కొల్లూరు, నగరం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే వారి బిడ్డలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోషకాహార ఆవశ్యకత, తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి అనంతరం గర్భిణులకు చీర సారె బహూకరించి, ఆశీర్వదించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయలక్ష్మి, తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదన్ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నగరం మండలం ఉల్లిపాలెలో నిర్వహించిన సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ చాలా మంది తీసుకునే ఆహారంలో పోషకాలు చాలా తక్కువగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు కృష్ణకుమారి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



కొల్లూరు: చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

సందడిగా శోభాయాత్ర

అద్దంకి, న్యూస్‌టుడే: మండలంలోని నాగులపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం సోమవారం భారీ జనసందోహం మధ్య సాగింది. తెలుగు యువత నేత సెంట్రల్ రామాంజనేయులు, గ్రామ పెద్దల నేతృత్వం వహించారు. గ్రామంలో మధ్యాహ్నం ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్ర ప్రారంభమైంది. అద్దంకి పట్టణం రామ్‌నగర్, పాతబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, భవానీ కూడలి మీదుగా గుండ్లకమ్మ నది వరకు ఇది సాగింది. బాణసంచాలు, కోలాటాలు, కేరళ బృంద నృత్యాలు, డీజే శబ్దాలతో పట్టణం దద్దరిల్లింది. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోలీసులు, విగ్రహ నిమజ్జన కమిటీ నేతలు నేతృత్వం వహించారు. దివంగత ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



కార్యక్రమంలో గొట్టిపాటి కమల కిశోర్, తెదేపా నేతలు

జన సైనికుల ప్రత్యేక పూజలు

పర్చూరు (మార్టూరు), చినగంజాం, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జన సైనికులు పర్చూరులోని వై- జంక్షన్‌లో ఉన్న ఆంజనేయస్వామి సన్నిధిలో సోమవారం రాత్రి దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందీప్ తేజ, ఆంజనేయులు, సునీల్, సురేంద్ర, సాంబయ్య, రామాంజి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● సోపిరాల శ్రీరామాలయంలో సోమవారం రాత్రి 8 గంటలకు జనసేన నేతలు పూజలు నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐవి జర్గా టి.సతీష్‌కుమార్, బొప్పన శ్రీనివాసరావు, పి.వెంకటేష్, ఎస్.గోపి, ఆశోక్, చెరుకూరి లక్ష్మణ్, ఎ.హరిబాబు, బి.సాయి, సురేష్, తెదేపా నేత శిఖరం సూరి పాల్గొన్నారు.



పర్చూరు: ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి నిరసన వ్యక్తం చేస్తున్న జన సైనికులు

అందరివాడు డాక్టర్ సాతులూరి దాస్

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ సాతులూరి దాస్ అందరివాడని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ దాస్ దంపతులను కళాశాల సమావేశపు మందిరంలో సత్కరించారు. కళాశాల ప్రణాళిక, అభివృద్ధి సభ్యులు, రోటరీక్లబ్‌ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సన్మానం, అభినందన కార్యక్రమం జరిగింది. విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, ఏజీపీ యర్రమోతు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకుంటున్న డాక్టర్ దాస్ దంపతులు


మీరు తినేదే.. మీ బిడ్డకు రక్ష

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

సమతుల ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం మన సొంతమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. దీనికితోడు రోజువారీ తీసుకునే ఆహారంపై చాలా మందికి అవగాహన ఉండడంలేదు... గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యకర బిడ్డకు జన్మనిస్తారు... ఆర్థికంగా ఉన్న మహిళలైతే పర్వాలేదు... రోజు వారీ పనులు చేసుకునేవారు... స్తోమత లేని వారు పోషకాలతో కూడిన వాటిని తీసుకోలేపోతున్నారు... దీనివల్ల వీరు రక్తహీనత బారిన పడి ప్రసవం కష్టంగా మారడంతో పాటు శారీరక లోపాలు ఉన్న బిడ్డలు పుడుతున్నారు.. ఈనేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వీరికి అందించే పౌష్టికాహారంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.



❖ దీనిలో భాగంగా అంగన్ వాడీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు. కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారుల బరువు, ఎత్తు, చుట్టు కొలతలు తీస్తున్నారు. వీటిని స్త్రీశిశు సంక్షేమ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ❖ చిన్నారుల పెరుగుదలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేస్తున్నారు. ఈసమయంలో రక్తహీనత ఉన్నవారిని వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వీరిని పంపుతున్నారు. ❖ మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరిస్తున్నారు. పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.



జిల్లాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల వివరాలు

❖ అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల సంఖ్య	: 65952
❖ బరువు తీసిన వారు	: 65841
❖ వయసుకు తగ్గ బరువు లేని వారు	: 151
❖ ఎత్తుకు తగ్గ బరువు లేని వారు	: 923
❖ ఎత్తుకన్నా మరీ బరువు తక్కువ ఉన్నవారు	: 341
❖ వయసుకు తగ్గ ఎత్తు లేని వారు	: 446
❖ గర్భిణులు, పాలిచ్చే తల్లులు	: 8006
❖ వీరిలో రక్తహీనతతో బాధపడేవారు	: 555

వయసుల వారీగా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు (గ్రాముల్లో)

ఆహార పదార్థాలు	1-3 ఏళ్లలోపు పిల్లలు	4-5 లోపు	7-9 లోపు	తేలికపాటి పనిచేసే మహిళలు	మహిళా కార్మికులు	మహిళా ఉద్యోగులు
ధాన్యాలు	120	210	270	300	360	480
పప్పు ధాన్యాలు	30	45	60	60	75	90
దుంపలు	50	100	100	100	100	200
ఆకుకూరలు	50	50	100	100	100	100
కూరగాయలు	50	50	100	100	100	100
పండ్లు	100	100	100	100	100	100
పాలు(మిల్లీ లీటర్లు)	500	500	500	300	300	300
బెల్లం/పంచదార	25	30	30	20	25	45
నూనె	20	25	25	20	30	40

రాష్ట్రస్థాయి పోటీలకు వలపర్ల క్రీడాకారులు

మార్టూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని వలపర్ల జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, పీడీ రవిదేవరాజ్ సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎం.కీర్తి, లారెన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో వారిని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



క్రీడాకారులు కీర్తి, లారెన్స్‌తో పీడీ రవిదేవరాజ్

మురళీమోహన్‌ను కలిసిన చీరాల ఎమ్మెల్యే

చీరాల, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు, తెదేపా సీనియర్ నేత మురళీమోహన్‌ను చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిల్మ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 2009లో ఒకేసారి ఇద్దరు వేర్వేరు చోట్ల ఎంపీలుగా పోటీచేశారు. ఏపీ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళీమోహన్, కోశాధికారిగా కొండయ్య గతంలో కలిసి పనిచేశారు. ఈనేపథ్యంలో ఇద్దరు అనేక విషయాలపై చర్చించుకున్నారు. రాష్ట్రంలో రాజకీయాలతోపాటు వ్యాపార ఇతర అంశాలు చర్చించినట్లు తెదేపా నాయకులు తెలిపారు. చీరాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కొండయ్య వివరించారు. ఎమ్మెల్యేగా బాగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని మురళీమోహన్ సూచించారు.



మురళీమోహన్‌తో కొండయ్య ఆత్మీయ ఆలింగనం

భావితరాలకు దార్శనికుడు ఏచూరి

గంగవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: భావితరాలకు దార్శనికుడు సీతారాం ఏచూరి అని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య కొనియాడారు. గంగవరం మంచాల వెంకటప్పయ్య, రంగమ్మ కల్యాణ మండపంలో సోమవారం దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఇండియా కూటమి ఏర్పాటులో ఆయన పాత్ర కీలకమన్నారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘాలు, సీఐటీయూ నాయకులు రామకోటేశ్వరరావు, వెంకట్రావు, గంగయ్య, హరి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కమలేశ్వరరావు, హనుమంతరావు, బాలచంద్ర, పుల్లారావు పాల్గొన్నారు.

పురపాలక అభివృద్ధికి సంపూర్ణ సహకారం

అద్దంకి, న్యూస్‌టుడే: పురపాలక సంఘం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెదేపా కౌన్సిలర్లు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ డి.రవీంద్రను ఆయన ఛాంబర్‌లో సోమవారం కలిసిన కౌన్సిలర్లు పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం దుశ్శాలువాతో కమిషనర్‌ను సన్మానించారు. తెదేపా కౌన్సిలర్లతో పాటు నేతలు రంగిశెట్టి సాంబశివరావు(లహరి), మాగులూరి గోపాలకృష్ణ, అంకం నాగరాజు, గుంటూరు మాధవరావు తదితరులు ఉన్నారు.

2న మాంసం విక్రయాలు నిలిపివేయాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు 2వ తేదీ మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధిలో మాంసం విక్రయాలు నిలిపివేస్తున్నట్లు కమిషనర్ బి.వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా చికెన్, మటన్, చేపల దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. దీనికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మంత్రి గొట్టిపాటి పంగులూరు రాక

జే పంగులూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం జే పంగులూరులో పర్యటించనున్నారు. ఉదయం 10.15 గంటలకు గ్రామంలో ఇంటింటి పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమీక్షకు హాజరవుతారు. ఆ మేరకు మంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందింది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

మార్టూరు, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ అన్నారు. మార్టూరులో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతంగా చేపట్టినట్లు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు అర్వపల్లి నాగహరగోపాల్, కోశాధికారి రామాంజనేయులు నేతృత్వంలో పలువురికి సభ్యత్వాలు అందజేశారు. బేబ్రోలు జయబాల హైమావతి, అంజయ్య, రఘురామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అన్నదాతలకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకొస్తుందని ఏవో వీరంరాజు కిషోర్ కుమార్ తెలిపారు. సోమవారం మార్టూరులో రైతులకు అవసరమైన ఎరువుల రకాలను ప్రభుత్వ ధరలకు అందజేశారు. డీఏపీ రూ.1350, యూరియా రూ.266.50 ధర చొప్పున అందజేస్తున్నామన్నారు. కావల్సినవారు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మంగళవారం ద్రోణాదుల, చిమ్మిరిబండలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

2న 'నెలనెలా నందివర్ధనం'

చీరాల (గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ తులసీనగర్‌లో ఈనెల 2న వివేక సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 'నెలనెలా నందివర్ధనం' సాహితీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త శీలం శ్రీనివాసరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు, ప్రముఖ సాహితీకారిణి చల్లపల్ల స్వరూపరాణి 'దళిత స్త్రీవాదం - విస్తృత విభిన్నతలు' అన్న అంశంపై ప్రసంగిస్తారన్నారు. సమావేశానికి విచ్చేసే అతిథుల రాకపోకల కోసం వెదుళ్లపల్లి కూడలి నుంచి తులసీనగర్ వరకు ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పదిహేను అంశాలు.. పది నిమిషాల్లో ముగింపు



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పురపాలక సంఘం సాధారణ సమావేశం పది నిమిషాల్లో ముగిసింది. ఉదయం 11.25 గంటలకు ఛైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభించారు. 15 అంశాలతో కూడిన అజెండాలోని అంశాలను 10 నిమిషాల్లో చదివి వినిపించగా సభ్యులు ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించారు. పురపాలక సంఘం అనుమతి పొందిన ఐదు పనులకు సంబంధించిన గుత్తేదారు మరణించడంతో రూ.22.84 లక్షల విలువైన పనులను రద్దు చేశారు. ఈనెలాఖరుతో గడువు ముగియనున్న 25 మంది పారిశుద్ధ్య కార్మికులు, 13 మంది ఇంజినీరింగ్ సహాయకులను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కొనసాగించే విధంగా తీర్మానించారు. కొద్దిపాటి అభివృద్ధి పనులతో కూడిన అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశం ముగిసిన తరువాత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి చిత్రపటాల తొలగింపుపై 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబు ప్రశ్నించారు. వెంటనే వాటిని ఏర్పాటు చేస్తామని కమిషనర్ డి.రవీంద్ర బదులిచ్చారు. పురపాలక సంఘంలో ఏడాది నుంచి వీధికుక్కల బెడద పెరిగిపోయిందని, తక్షణం పరిష్కరించాలని ఆరో వార్డు కౌన్సిలర్ కంపా రజిని సభ దృష్టికి తెచ్చారు. దీనికి కమిషనర్ బదులిస్తూ వీధికుక్కలను పట్టుకునే ప్రత్యేక నిపుణుల కోసం ప్రయత్నిస్తున్నామని, వారు అందుబాటులోకి రాగానే టీకా వేయిస్తామని చెప్పారు.

తెదేపాకు జై కొట్టిన వైస్‌ఛైర్మన్, 8, 10వ వార్డు కౌన్సిలర్లు

పురపాలక సంఘంలో వైకాపాకు చెందిన వైస్‌ఛైర్మన్ దేసు పద్మేష్, 8, 10వ వార్డు కౌన్సిలర్లు బి.వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి సుధీర్‌లు తెదేపాకు జైకొట్టారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లున్న పాలకమండలిలో 13 మంది వైకాపా, ఏడుగురు తెదేపా తరపున విజయం సాధించారు. గడిచిన సాధారణ ఎన్నికల సమయంలో 13, 19వ వార్డు కౌన్సిలర్లు కొణిజేటి విజయలక్ష్మి, యేజెండ్ల నాగరాజు తెదేపాలో చేరారు. నాడు పరోక్షంగా పద్మేష్, సుధీర్, వెంకటేశ్వర్లు తెదేపాకు సహకారం అందించారు. వీరి రాకతో పాలకమండలిలో తెదేపా బలం 12కు పెరగ్గా, వైకాపాకు ఎనిమిది మంది మాత్రమే మిగిలారు. దీనికి అనుగుణంగా తెదేపా కౌన్సిలర్ల పక్కన కొత్తగా చేరిన వైస్‌ఛైర్మన్, కౌన్సిలర్లకు సీట్లు కేటాయించడం విశేషం.

'దీపాలు వేయించలేని స్థితిలో కౌన్సిలర్లు ఉన్నారా'

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వీధి దీపాల నిర్వహణపై కౌన్సిల్ సభ్యులు ఏకరవు పెట్టారు. కౌన్సిలర్లు పాపిశెట్టి సురేష్, మామిడాల రాములు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, చీమకుర్తి బాలకృష్ణ, కీర్తి వెంకట్రావులు మాట్లాడుతూ బల్బులు మాడిపోతే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి ఎన్నోసార్లు విన్నవించాల్సి వస్తోందన్నారు. కొనుగోలు చేస్తున్న ఎల్ఈడీ బల్బుల్లో నాణ్యత లేకపోవడంతో తరచూ మాడిపోతున్నాయా?... దీపాలు వేయించలేని స్థితిలో కౌన్సిలర్లు ఉన్నారా.. ? అనే వ్యాఖ్యలు ప్రజల నుంచి వినపడుతున్నాయని సమావేశం దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మురుగు కాలువల్లో ప్రస్తుతం తీస్తున్న వ్యర్థాలు అక్కడే పోస్తున్నారని దానివల్ల వర్షాలు పడితే మళ్లీ ఆ మట్టి అంతా కాలువలోకి పోతోందని.. దుకాణాలు, ఇతరత్రా వాటి అభివృద్ధి పనుల కోసం అజెండాలో పొందుపరిచే సమయంలో ఆ వార్డు పేరు ఉదహరించాలని పలుమార్లు సూచించినా అధికారులు పట్టించుకోవడంలేదని కౌన్సిలరు మామిడాల రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల్లో చిల్లచెట్లు పెరగడం వల్ల పాములు బెడద ఎక్కువగా ఉందన్నారు. అజెండాలో తొమ్మిది అంశాలు పొందుపరచగా వాటిని ఆమోదించారు. అనంతరం సప్లిమెంటరీ అజెండాలో ఉన్న మూడు అంశాల్లో మూడో దానికి టెండర్లు పిలవాలని సభ్యులు సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన మున్సిపల్ ఉద్యోగులను కౌన్సిల్‌లో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో ఛైర్మన్ మాట్లాడుతూ అందరు బాధ్యతగా పనిచేసి, అవినీతి రహిత పాలన ప్రజలకు అందించాలని కోరారు. కమిషనరు కె.చక్రవర్తి, ఇన్‌ఛార్జి డీఈ రవికుమార్, ఇతర అధికారులు, కౌన్సిలర్లు ఉన్నారు.



కౌన్సిల్ సమావేశంలు

భక్తిశ్రద్ధలతో గంధం మహోత్సవం

చీరాల : స్థానిక వైకుంఠపురంలోని హజరత్ సయ్యదీనా సయ్యద్ కరీముల్లాషా వారి గంధం ఉరుసు మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. సోమవారం గంధం ఉరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం దీపారాధన జరిగింది.



విద్యుత్తు దీపాలతో దర్గా

ఇంకొల్లులో అగ్నిప్రమాదం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: స్థానిక ఇస్లాం పేటలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి ఆస్తి నష్టం జరిగింది. షేక్ బాబు గృహంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమీప గృహస్థులు వచ్చేలోపు ఇంట్లోని వస్తువులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. చీరాల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో గృహోపకరణాలు, రూ.పది లక్షలు విలువచేసే విక్రయానికి తెచ్చిన చీరలు, కొంత నగదు బూడిదగా మిగిలాయని బాధితుడు బాబు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలో అలకాపురం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చీరాలకు చెందిన ఎస్.శ్రీనివాసరావు సోమవారం నిజాంపట్నం నుంచి ద్విచక్రవాహనంపై చీరాల వస్తుండగా అలకాపురం గాంధీ బొమ్మ సెంటర్‌లో అదుపుతప్పి పడటంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

సీనియర్ సహాయకుడు విక్టర్‌కు నివాళి

యద్దనపూడి: యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న పి.విక్టర్ (56) ఆకస్మికంగా మృతిచెందడం తీరనిలోటని ఎంపీడీవో ఎం.ఎ.జావిద్ అన్నారు. ఆదివారం యద్దనపూడిలోని గృహంలో చనిపోవడంతో మృతదేహాన్ని బంధువులు స్వగ్రామం పొదిలి తరలించారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనతో మెలగాలి

మార్టూరు: ప్రజలు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహనతో మెలగాలని హెల్ప్ సంస్థ ప్రతినిధి దుర్గ కోరారు. వలపర్లలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రూతు, సల్మా, ప్రమీల పాల్గొన్నారు.

ముగిసిన పౌష్టికాహార మాసోత్సవాలు



సంతమాగులూరు మండల కార్యాలయాల సముదాయ ఆవరణలో మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సీడీపీవో సుధ

పర్చూరు (మార్టూరు), న్యూస్‌టుడే: కొద్దిరోజులుగా ఐసీడీఎస్ అధికారులు చేపట్టిన పౌష్టికాహార మసోత్సవాలను సోమవారం ముగింపు పలికారు. సెక్టార్ పరిధిలోని పర్చూరులో సోమవారం సామూహిక సీమంతాలు, ప్రదర్శనలు, పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటుచేసి తద్వారా బాలింతలు, గర్భిణీలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో జి.సుభద్ర, ఎంపీడీవో పద్యుమ్నకుమార్, తహసీల్దార్ బ్రహ్మయ్య, వైద్యుడు ఏకాంబరం పాల్గొన్నారు.

సంతమాగులూరు, న్యూస్‌టుడే: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారంపై మాసోత్సవాల్లో అవగాహన కల్పించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో సుధ తెలిపారు. అనంతరం మండల కార్యాలయాల సముదాయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీపీ వై.యలమంద, ఎంఈవోలు వి.కోటేశ్వరరావు, దినేష్‌కుమార్, ప్రభుత్వ వైద్యాధికారిణులు ఉమాదేవి, జ్యోత్స్న పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

అద్దంకి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ ఆహ్వానపత్రిక సోమవారం రాత్రి ఆలయంలో ఆవిష్కరించారు. పాలకమండలి ఛైర్మన్ ఊటుకూరి రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావుతో కూడిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి అర్వపల్లి హనుమంతరావు, కోశాధికారి నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయ సహాయకులు చిన్ని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు, కారంచేడులో..

పర్చూరు, కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధ్వర్యంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. కారంచేడులోని శ్రీ వైష్ణవి దుర్గాలయం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిత్యం నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

చినగంజాం, న్యూస్‌టుడే: వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు ఇచ్చారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్యులు బీపీ, షుగరు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీవో కె.స్వరూపరాణి, వైద్య సిబ్బంది చిరంజీవి, స్టాలినీదేవి, సుబ్బారావు, గ్రామ కార్యదర్శి ఆళ్ల మస్తాన్‌రావు, సర్పంచి రాయని ఆత్మారావు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

అద్దంకి, న్యూస్‌టుడే: మహిళ మెడలో నాలుగు సవర్ల బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన అద్దంకి-వేలమూరిపాడు రహదారిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. రామ్‌నగర్‌లో నివసించే పద్మావతి, మరో మహిళ సాయంత్రం వేళ నడక కోసం వేలమూరిపాడు రోడ్డుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొంతమేర చీకట్లు కమ్మాయి. ఈ సమయంలో ఆగంతకుడు ద్విచక్రవాహనంపై వచ్చి, పద్మావతి మెడలో బంగారం గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమేరకు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఇదే తరహాలో మహిళ మెడలో గొలుసు లాక్కుని పరారైన ఉదంతం జరగడం విశేషం.